# మంచి ముత్యం

- విశ్వనాథ రమ

"డాక్టర్! మా. అమ్మాయికి టెంపరేచర్ ఎక్కువగా వుంది. సొమ్మసిల్లినట్టుగా పడిపోయింది. మీరు తప్పకుండా రావాలి. ఆ అమ్మాయి లేకపోతే నాకు జీవితమే లేదు. ప్లీజ్!"

అప్పుడే నర్సింగ్ హోమ్ నుంచి వచ్చి ఫ్రెష్‌గా తయారై పుస్తకం చేతిలోకి తీసుకొన్న నేను ఆవిడ వైపు పరిశీలనగా చూశాను. తనకే మృత్యువు సమీపించినట్టుగా, అగాథంలోకి కూరుకుపోతున్నట్టుగా అశ్రుసిక్త నయనాలతో చేతులు జోడిస్తూ నిలబడిందామె.

మనిషి తెల్లగా లావుగా వుంది. ఆదుర్దాగా రావటం వల్ల షిఫాన్ చీర కుచ్చుళ్ళు కిందకి పైకి జీరాడుతున్నాయి. పెదాలకున్న లిప్‌స్టిక్ వెలసిపోయిన రంగులా కనిపిస్తోంది.

నర్సింగ్ హోమ్ నుంచి రాగానే రిలాక్స్‌గా కూర్చుని కీట్స్, తిలక్ కవితలు చదువుతూ శరత్ నవలల్లో మునిగిపోతే ఏదో సంతృప్తి మనసంతా పేరుకుపోయి ఆరోజు పడిన శ్రమంతా మర్చిపోయేది. లేకపోతే వీణ చేతిలోకి తీసుకుంటే తనను తాను మర్చిపోయేది. ఆ సంగీత ఝరి మదిలో దాగిన వ్యథను పోగొట్టి ఉత్సాహం అణువణువులో నింపేది.

ఇలాంటప్పుడు పేషెంట్లు వస్తే కాస్తా చికాగ్గా అనిపించినా మానవసేవయే మాధవసేవ అనే ఆర్యోక్తి ఎప్పటికప్పుడు వెన్నుతట్టి కర్తవ్యాన్ని గుర్తుచేయడం వల్ల వాళ్ళ వెంట వెళ్ళేది.

"డాక్టర్ ప్లీజ్! ఆ అమ్మాయికి ఏదైనా జరిగితే నాకింక బతుకు లేదు. ఒక్కసారి చూడండి."

ఆయాకి తలుపేసుకోమని చెప్పి ఆమె వెంట బయలు దేరాను. రాత్రి తొమ్మిది గంటలైంది. ఆమె తెచ్చిన కారులో కూర్చుంటూ అన్నాను. "మీరు ఆ పాపకి సొంత తల్లేనా!"

నా మాటలకి కాస్తా కంగారుగా చూసి ఔనన్నట్టుగా తలూపింది. "మీకు మరి పిల్లలు లేరా!" అవిడ పదే పదే ఆ అమ్మాయి కోసం తాపత్రయ పడటం చూసి ఆ అనుమానం తీర్చుకోవాలనుకున్నాను.

"లేరు!" ఆవిడ గొంతు లోయలోంచి వచ్చినట్టయుంది.

కారు ఎన్నో మలుపులు తిరుగుతోంది. కారు స్పీడందుకోవడం చూసి సిటీకి బాగా దూరం వచ్చామని గమనించాను. ఎప్పటికప్పుడు అనుకొంటుంది. నర్సింగ్ హోమ్‌లో తప్ప ఇలా దూరంగా వచ్చి కేసులు చూడ్డం విరమించుకోవాలని. వాళ్ళు ప్రాధేయపడుతూంటే మానవతకు లొంగిపోతుంది.

దూరంగా కంపెని క్వార్టర్స్ కనిపిస్తున్నాయి. ఒక క్వార్టర్ దగ్గర కారాగింది. అంతా చీకటి ఇళ్ళల్లో అక్కడక్కడ లైట్లు వెలుగుతున్నాయి.

ఆమెతో పాటు క్వార్టర్‌లోకి నడిచాను. అక్కడ సోఫాలో కూర్చోగానే ఆమె టెన్షన్‌గా అంది. "పాప బెడ్‌రూమ్‌లో వుంది. ఇలా రండి!"

నేను ఆ గదిలో అడుగు పెట్టాను. పాపకి టెంపరేచర్ చూస్తూంటే ఆ గది గోడకి వేలాడదీసిన రాధాకృష్ణుల పెయింటింగ్ చూసి త్రుళ్ళిపడ్డాను. తలమీద ఎవరో సుత్తితో పొదుస్తున్నట్టయింది.

ఆ పెయింటింగ్ తను వేసినదే! ఇక్కడికెలా వచ్చింది? ఆ గదిలో వస్తువులు చూస్తూంటే పాత జ్ఞాపకాలు సినిమా రీలులా కళ్ళముందు కదలాడసాగాయి. ఈ ఇల్లు... ఫణిచంద్రది కాదు కదా!

"మీ శ్రీవారి పేరు?" ఆత్రంగా ఆమెవైపు చూశాను.

"ఫణిచంద్ర. కంపెనీ మేనేజర్‌గా పనిచేస్తున్నారు!"

అంతే! గుండెలో ఏదో తుఫాను మొదలైంది. అంటే ఈ పాప ఫణిచంద్ర కూతురా! ఇదెలా సాధ్యం.

మీరతని రెండవ భార్య...? ఇంజక్షన్ పాపకి చేశాక అడిగాను.

"ఔను! అతను మీకు తెలుసా! తడబడుతున్నట్టుగా అడిగింది.

"అతని భార్య ఒకప్పటి నా ఫ్రెండ్" అంటూ పాప వైపు పరిశీలనగా చూశాక ఏ జ్ఞాపకం వచ్చినట్టు అడిగాను.

"మీ శ్రీవారు కనిపించరేం?"

"హెడ్డాఫీసు నుంచి ఫోన్ రావడం వల్ల కంపెనీకి వెళ్ళారు. ఈరోజు నైట్ షిఫ్ట్ లేదు. వేగంగానే వచ్చేస్తారు!"

"పాపకి ఫర్వాలేదా!" మళ్ళా ఆమె కళ్ళల్లో ఏదో దిగులు.

"ఫ...ర్వా... లేదు" నాకు తెలీకుండానే నా గొంతు మారింది.

జీపు శబ్దం బయట వినిపించింది.

రెండు నిమిషాల తర్వాత ఫణిచంద్ర గదిలోకి రాగానే అందామె. "ఈ డాక్టర్ సమయానికి రావడం వల్లే మన పాపకి ప్రాణగండం తప్పింది. లేకపోతే మీరు నన్ను ప్రాణాలతో వుంచేవారు కాదు."

ఫణిచంద్ర కళ్ళు తనను ఆశ్చర్యంగా చూశాయి. ఆ కళ్ళల్లో వింతకాంతి, ఏభై ఏళ్ళు దాటినా నలభై ఏళ్ళ యువకుడిలా అదే రూపం.

"హలో డాక్టర్ రమా!"

తను చిన్నగా నవ్వుతూ బయట సోఫాలో కూర్చుంది. ఒక్కసారిగా పాత జ్ఞాపకాలు చుట్టుముట్టాయి.

ఫ్రెండ్ సుగుణ దగ్గరికి రాధాకృష్ణుల పెయింటింగ్‌తో ఒకసారి వచ్చింది. "భగవంతుడు నాకు అన్నీ ఇచ్చాడు. పిల్లల్ని మాత్రం ఇవ్వలేదు" అని బాధపడుతూంటే తను డాక్టర్ మహాలక్ష్మి దగ్గరికి వెళ్ళమని సలహా ఇచ్చింది. ఫణిచంద్ర కూడా చెకప్‌కి ఒప్పుకున్నాడు. రిపోర్ట్స్‌లో ఫణిచంద్రలో స్పెర్మ్ కౌంట్ బాగా తగ్గిపోయిందని అతనికి పిల్లలు పుట్టే అవకాశాల్లేదని తేలింది. ఇది తెలిసిన సుగుణ తన చేతులు పట్టుకొంది. "ఆయనలో లోపం వుందంటే ఆయన సహించరు. ఆ లోపం నాలోనే వుందని చెప్పు, ఆడదానిగా అన్నీ భరించటం అలవాటు చేసుకున్నాను" అంటూ ఏడ్చింది. చేసేది లేక రిపోర్ట్స్ నా దగ్గరే వుంచుకున్నాను. ఫణిచంద్రకి మాత్రం సుగుణలోనే లోపం వుందని చెప్పక తప్పింది కాదు. తర్వాత కిడ్నీలు చెడిపోవడం వల్ల సుగుణ పోయింది. ఆ నిజం మాత్రం నాలోనే వుండిపోయింది.

మళ్ళీ... ఇన్నాళ్ళకి ఆ నిజానికి గ్రహణం పట్టిందా! లేకపోతే లోపం ఎక్కడుంది. నేను ఆమె వైపు చూడసాగాను.

ఫణిచంద్ర దర్జాగా కాలుమీద కాలు వేసుకొని అన్నాడు. "నా కూతుర్ని చూశారుగా! మీ ఫ్రెండ్‌లో లోపం వల్ల పిల్లలు పుట్టలేదు. ఇప్పుడు మంచి ముత్యంలాంటి పిల్లని చేసుకున్నాను. పాప పెళ్ళయిన సంవత్సరానికే పుట్టింది."

"నిజమేనండి. ఆ రిపోర్ట్స్ ఇంకా నా దగ్గరే వున్నాయి. మిమ్మల్ని డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళడం, చెకప్‌లు, రిపోర్ట్స్ అన్నీ గుర్తున్నాయి" అంటూ ఆమె వంక గుచ్చి గుచ్చి చూడసాగాను.

ఆమె కళ్ళల్లో ఏదో సందిగ్ధత. ఆ నిజం చెప్పొద్దన్నట్టుగా అభ్యర్థన. చేతులు జోడిస్తూ తల అడ్డంగా ఊపిందామె.

సోమార్‌సెట్ మామ్ "ది పెరల్" కథ అప్రయత్నంగా జ్ఞాపకం వచ్చి దిగ్గున అక్కణ్ణుంచి లేచాను. కారులో కూర్చున్నాక నా దగ్గరగా వచ్చిందామె.

"మేము నలుగు రాడపిల్లలం. తల్లితండ్రి లేరు. ఇతనికి పిల్లలు కావాలనే కోరిక ఎక్కువ. అందుకే... ఆ రిపోర్ట్స్!" కన్నీళ్ళతో చేతులు జోడించింది.

కారు స్టార్టయ్యాక అన్నాను. "ఇంటికెళ్ళాక చింపేస్తాను. బాధపడకండి!"

"మీరు మంచి ముత్యం లాంటి వారు!" కృతజ్ఞత ఆమె కళ్ళల్లో తొంగిచూసింది. కారు స్పీడందుకుంది. డార్విన్ పరిణామ సిద్ధాంతం స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్, సర్వైవల్ ఆఫ్ ది ఫిటెస్ట్ గుర్తుకు రాసాగాయి. 'మంచి ముత్యంలాంటి అమ్మాయిని చేసుకున్నాను' అనే ఫణిచంద్ర పలుకులకి నవ్వు తెరలుగా రాసాగింది.